క్లుప్తంగా

టీబీ వ్యాధిపై అప్రమత్తత అవసరం

మిర్యాలగూడ : టీబీ వ్యాధిపై అప్రమత్తత అవసరమని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం దామరచర్ల మండలంలోని సిమెంట్ పరిశ్రమంలో ఏర్పాటు చేసిన జాతీయ టీబీ వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నట్లయితే వ్యాధిని నివారించుకోవచ్చన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత మందులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారి కల్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు గీతావాణి, వేణుగోపాల్‌రెడ్డి, కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు, వైద్యాధికారులు మహేష దస్తగిరి, బ్లెస్సీ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కొండమల్లేపల్లి : యువత డ్రగ్స్, గంజాయి, మాదవ ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ టెక్నికల్ రాష్ట్ర కో కన్వీనర్ రమావత్ లక్ష్మణ్ కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షాహిద్ భగత్‌సింగ్ స్మారక యువజనోత్సవాల పోస్టర్‌ను స్థానికంగా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చరణ్, శ్రీరాం, సాయిరాం, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సకాలంలో చికిత్స చేయించాలి

త్రిపురారం: పశువులకు వచ్చే వ్యాధులను రైతులు ప్రాథమిక దశలోనే గుర్తించి వాటికి తగిన చికిత్స చేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా సంచాలకుడు డాక్టర్ రమేష్ అన్నారు. గురువారం త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామంలో గోపాలమిత్ర పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది 49 గేదెలకు పలు వ్యాధులు గుర్తించి అవసరమైన ఇంజక్షన్లు చేశారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. 36 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో ఆ శాఖ నిడమనూరు అసిస్టెంట్ డైరెక్టర్ జూలకంటి రంగారెడ్డి, అంజనపల్లి డాక్టర్ శశికళ రెడ్డి, త్రిపురారం డాక్టర్ నాగేందర్, ఎల్ఎస్ఏ సయ్యద్, గోపాల మిత్ర సూపర్ వైజర్ శివారెడ్డి, ఓస్ వెంకటమ్మ, గోపాల మిత్రలు అమర్‌సింగ్, ప్రభాకర్, సందీప్, అశోక్, పశుమిత్ర దుర్గా భవాని, పాల్గొన్నారు.

గ్రూప్ -1, 2 నియామకాలు నిలిపివేయాలని రిలే దీక్ష

గుర్రంపోడు : ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత వచ్చేంత వరకు గ్రూప్ 1, గ్రూప్ 2ల నియామకాలు నిలిపివేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెండో రోజు రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు పోలేని యాదయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత వచ్చేంత వరకు ఎలాంటి ఫలితాలు విడుదల చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మారపాక గిరి, ప్రధాన కార్యదర్శి గాదెపాక కోటేష్, మండల సీనియర్ నాయకులు దున్న ఈదయ్య, నాయకులు మామిడి పెద్దులు, పాల్వాయి నరేష్, బొంగరాల చక్రవర్తి, పాల్గొన్నారు

గ్రూప్- 1 ర్యాంకర్‌కు అభినందన



అశోక్‌నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించిన తేజావత్ అశోక్ నాయక్‌ను బంజారా ఉద్యోగుల సంఘం, బంజారా సంఘం ఆధ్వర్యంలో గురువారం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జైత్రంనాయక్, శ్రీధర్‌గౌడ్, సీతారాం నాయక్, మత్రునాయక్, రవీందర్‌నాయక్, మక్లనాయక్, శంకర్ నాయక్, నాని నాయక్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో వరల్డ్ కిడ్నీ డే వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న వైద్యులు

మిర్యాలగూడ అర్బన్ : వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి రోగులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస సమరథ్, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డయాలసిస్ ఇన్‌చార్జ్ రాంబాబు, పండు, శెభన్, శివ, పవన్, సైదమ్మ, మమతా తదితరులున్నారు.

పన్నుల వసూలుకు ప్రత్యేక బృందాలు

- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ
- రూ.3.17కోట్లకు గాను రూ. 1.80కోట్లు వసూలు



పన్ను చెల్లింపుదారులకు రశీదు ఇస్తున్న అధికారులు

దేవరకొండ : మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులే కాకుండా పట్టణ అభివృద్ధికి ఆస్తి పన్ను, నీటి పన్నులు సైతం అవసరమే..ఇందుకు గాను 2024–25 సంవత్సరం లక్ష్యాలను సాధించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు వేచి చూడకుండా పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఇటీవల జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీలో వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలతో పాటు నివాస గృహాలు, వాణిజ్య సముదాయాల నుంచి ఆస్తి పన్నులు వసూలు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అయితే దేవరకొండ మున్సిపాలిటీలో ఆస్తి పన్నులు రూ.3 కోట్ల 17లక్షల 17వేలకు గాను రూ.1కోటీ80లక్షల75వేలు మాత్రమే వసూలయ్యాయి. అదే విధంగా నీటి పన్నుల బకాయిలు రూ.3కోట్ల 25 లక్షలకు గాను కేవలం రూ.31 లక్షల 48వేలు మాత్రమే వసూలయ్యాయి. ట్రేడ్ లైసెన్స్‌ల బకాయిలు రూ.15లక్షల 30వేలకు గాను రూ.2లక్షల 50వేల రూపాయలు వసూలైనట్లు సంబంధిత మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులను జారీ చేస్తున్నారు.

లక్ష్యం చేరుకునేలా..

ఆర్థిక ముగిసే సమయం నాటికి వందశాతం పన్ను వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు మున్సిపాలిటీకి రావాల్సిన ఆస్తి పన్నుల బకాయిల వసూళ్లు మాత్రం లక్ష్యాన్ని చేరుకునేలా కన్పించడం లేదు. సాధారణ పన్నులు (ఆస్తి, నీటి, ట్రేడ్ లైసెన్స్‌లతో పాటు ఇతర పన్నులు) వసూళ్లు కాకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించడం సైతం ఇబ్బందిగా మారిందనే చెప్పొచ్చు. కార్మికుల వేతనాలతో పాటు కనీసం అభివృద్ధి పనులను చేపట్టేందుకు కూడా పన్నుల వసూలే మార్గమని భావించిన మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. మున్సిపాల్టీలో 20వార్డులలోని నివాస గృహాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల నుంచి పన్నులను వసూలు చేయడానికి వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒక్కో వార్డులో ముగ్గురు చొప్పున పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మున్సిపాలిటీలో పెద్ద మొత్తంలో ఆస్తి పన్ను, నల్లాల బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులను జారీ చేస్తున్నాం. పట్టణ ప్రజలు ఆస్తి, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ బకాయిలు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఇదిలా ఉంటే ఇప్పటికే వార్డుల వారీగా పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. – సుదర్శన్, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

శిశు మరణాలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో డీఎంహెచ్ఓ

నల్లగొండ: శిశు మరణాలు లేని జిల్లాగా నల్లగొండను తీర్చిదిద్దాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో మిర్యాలగూడ డివిజన్ పరిధిలో శిశు మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రసవానంతరం శిశువులు చనిపోవడాన్ని తగ్గించాలని, ఇందుకు వైద్య ఆరోగ్యశాఖతోపాటు, మహిళా, శిశు సంక్షేమ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. అవగాహనలోపం, మూఢనమ్మకాలు, సకాలంలో వైద్యం అందకపోవడం వల్ల శిశువులు చనిపోవడానికి వీల్లేదన్నారు. సాధ్యమైనంతవరకు వారిని బతికించేందుకు కృషి చేయాలన్నారు. అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు సిద్ధంగా ఉంచాలన్నారు. వైద్యులు ప్రతినెలా రెండుమార్లు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి శిశు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, డాక్టర్లు వసుంధర, స్వరూప, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, వైద్య అధికారులు పాల్గొన్నారు.

చివరి భూములకు నీరందేలా పర్యవేక్షణ



డీ 25 మేజర్ కాల్వను పర్యవేక్షిస్తున్న ఏఎమ్మార్పీ అధికారులు

గుర్రంపోడు : కాల్వలకు చివరి భూములకు నీరందించి ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరి పంటను కాపాడేందుకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. డీ – 25లో కాల్వ చివర ఉన్న మారేపల్లి గ్రామ ఆయకట్టుకు వరిపంటకు నీరు అందకపోవడంతో లెక్టర్ కాల్వను స్వయంగా పరిశీలించి అధికారులకు ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం నీటిపారుదల అధికారులు లష్కర్లు, సిబ్బంది సహాయంతో కాల్వ వెంట అనధికారికంగా రైతులు ఏర్పాటు చేసుకున్న గండ్లు పూడ్చివేసి, పైపులు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. కాల్వలో నీటి మట్టం పెరిగేలా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను పెంచడంతో ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం పెరిగింది. గుర్రంపోడు డివిజన్ పరిధిలో డీ 25 కాల్వ 18కిలోమీటర్ల పొడవునా ఉండగా ఇందులో 16 కిలోమీటర్ల వరకు మాత్రమే కొద్ది రోజులుగా నీరు చేరుతుంది. మొదట్లో కాల్వ చివరి వరకు నీరు చేరడంతో రైతులు ఆయకట్టులో చివరి భూముల రైతులు కూడ వరిసాగు చేసుకోగా ప్రస్తుతం పొట్ట దశలో నీరు అందకపోడవంతో ఆందోళనకు గురవుతున్నారు. ఎండలు ముదరడం, నీటి అవసరం పెరగడంతో చివరకు నీరు చేరని పరిస్థితుల్లో కాల్వ మొదట్లో గండ్లు పూడ్చడం ద్వారా నీటి వృథాను అరికట్టి ఆయకట్టు అంతటికీ సరిపడా నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. నీటిని వృథా చేయకుండా చివరి భూముల రైతులకు నీరు అందేలా చూడాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించి గండ్లు పూడ్చి వేయిస్తున్నారు. నీటిని వృథాను మాత్రమే నిలువరిస్తున్నామని రైతులు సహకరించాలని ఏఎమ్మార్పీ డివిజన్ ఈఈ నెహ్రూ నాయక్ తెలిపారు. ఈఈ వెంట డీఈఈలు పరమేష్, సురేష్‌కుమార్, ఏఈలు శ్రీనివాసరావు, చంద్రప్రకాశ్‌రెడ్డిలు ఉన్నారు.

31వతేదీ వరకు ఎల్ఆర్ఎస్ రాయితీ

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : ఎల్ఆర్ఎస్ రాయితీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్(లోకల్‌బాడీస్) జె. శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ ఛాంబర్స్‌లో ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను బకాయిలు, నీటి బకాయిలు, నీటి ఎద్దడి, పారిశుద్ధ్యంపై అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 31వ తేదీలోగా తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని, ఈ విషయంపై యాజమానులకు 25శాతం రాయితీని కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం రూ.వేయి చెల్లించి 2020లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్లలల్లో యజమానులు లే అవుట్లలోని వాటిని రెగ్యులరైజ్ చేసుకోవలన్నారు. మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ లే అవుట్ల వద్దకు వెళ్లి వారికి ఎల్ఆర్ఎస్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీలో 25 కోట్ల 64 లక్షల రూపాయల గాను గాను సుమారు 7 కోట్ల వరకు వసూలు చేయడంతో చాలా వె వెనుకడినట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు వంద శాతం వసూలయ్యే విధంగా చూడాలన్నారు. ఆస్తి పన్నుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో మొత్తం 24 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేయాల్సి ఉండగా పెద్ద దేవులపల్లి రిజర్వాయర్‌తో పాటు మిషన్ భగీరథ ద్వారా 21ఎంఎల్‌డీలను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ఎన్‌టీఆర్ కాంప్లెక్స్ టెండర్ల విషయాన్ని పరిశీలించి త్వరలోనే టెండర్లు వేసేందుకు ప్రత్యేక చర్యలను చేపడతామన్నారు. మొదటి సారిగా అడిషనల్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛంను అందజేస్తున్న కమిషనర్, సిబ్బంది తదితరులున్నారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, ఆర్ఓ జ్ఞానేశ్వరీ ఆర్ఐలు సాంబయ్య, సాజి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీఎంసీ పాతే పాక బక్కయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దాసోజు శ్రవణ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం అభినందనీయం

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కు ఇవ్వడం అభినందనీయమని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేత అన్నభిమోజు నాగార్జునచారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడగోజు చంద్రశేఖర్, రాష్ట్ర విశ్వబ్రహ్మణ సంఘం కార్యదర్శి చెర్యాల వెంకటాచారి, తెలంగాణ రాష్ట్ర స్వర్ణకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధనచారి అన్నారు. గురువారం స్థానిక టాకా రోడ్డులో విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో విశ్వబ్రహ్మణ సంఘం మండల అధ్యక్షులు శిరసనగండ్ల ఈశ్వరాచారి, నాయకులు కూరెళ్ల మట్టయ్య తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలి

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని సర్వే నంబర్ 115 లో గల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్న వారికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.15లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఇంటింటికి సీపీఎం పోరుబాట కార్యక్రమంలో ఆ యన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణ య్య, ఆర్.సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

‘పీఎం శ్రీ’తో ఐసీడీఎస్ నిర్వీర్యం



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మిర్యాలగూడ టౌన్ : ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే పీఎం శ్రీతో పాటు మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బొందు పార్వతి మాట్లాడారు. వేసవిలో ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అదే రీతిలో సెలవులు ఇవ్వాలని, ఆన్‌లైన్ యాప్‌లన్నింటిని రద్దు చేయాలని కో రారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలన్నారు. బీఎల్ఓల డ్యూటీలను రద్దు చేయడంతో పాటు అంగన్‌వాడీకి సంబంధం లేని పనులను అప్పగించవద్దన్నారు. అంగన్‌వాడీలో కారుణ్య నియమకాలను తక్షణమే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాల్లు స్వరాజ్యం, రాధాబాయి, ప్రమీల, సైదమ్మ, తూడి అరుణ, రహీద బేగం, షాహిన్, సీఐటీయూ నాయకులు మల్లు గౌతమ్‌రెడ్డి, తిరుపతి రామ్మూర్తి తదితరులున్నారు.

లెప్రసీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శంకర్‌నాయక్

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రతి ఇంటిలో ఉన్న కుటంబ సభ్యులందరికీ లెప్రసీ సర్వే నిర్వహించాలని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో లెప్రసీ సర్వేలో వైద్య సిబ్బంది పాటించాల్సిన విధివిధానాలపై వైద్యసిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీనుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో లెప్రసీ సర్వేలో సిబ్బంది పాల్గొన్నాలన్నారు. నేషలన్ లెప్రసీ ఎరాడికేషన్ కార్యక్రమంలో భాగంగా లెప్రసీవ్యాధిని తరిమికొట్టడానికి సర్వేలో మచ్చలు గుర్తించి తగిన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లెప్రసీ సర్వేలో త్రిపురారం మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటయ్య, పారామెడికల్ సిబ్బంది పుట్టా గోపాల్ రెడ్డి, సూపర్ వైజర్ కమలమ్మ, ఏఎన్ఎంలు, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్: మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సాగర్ రోడ్డులో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొల్లమాంబ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆమె విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. . పట్టణంలోని మొల్ల మాంబ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, చిట్టిబాబునాయక్, కుమ్మరి సంఘం నాయకులు జమ్మిశశ్రీట్టి వేణుగోపాల్, ప్రజాప్రతి సభ్యులు కామిశెట్టి రామకృష్ణ, కామిశెట్టి శ్రీనివాస్, నీలకంఠం భాస్కర్, చలికంటి రాములు, బాల కృష్ణ, పాలేపల్లి శేఖర్, అయ్యన్న, లక్ష్మినారాయణ, యాదగిరిలతో పాటు వివిధ మండలాలకు చెందిన నాయకులు తదితరులున్నారు.

మొల్లమాంబకు నివాళి

పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు అమరవీరుల స్థూపం వద్ద కుమ్మరి సంఘం యనాయకులు వెంకటయ్య ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లికంటి వెంకటయ్య, బీసీ సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శేఖర్, సైదులు తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గురువారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ప్రముఖ తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి సైదులు, మాడ్గుల యాదగిరి, కుమ్మరి శాలివాహన సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో కంటి వైద్యపరీక్షలు

కొండమల్లేపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రతి సోమవారం, గురువారం నిర్వహించే కంటి పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణులు కృష్ణమాచారి పేర్కొన్నారు. గురువారం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అనంతరం వారికి అవసరమైన మందులను అందజేశారు.

సీపీఎం మాజీ కౌన్సిలర్ మృతి



ఎంఏ ఖాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ : పట్టణానికి చెందిన సీపీఎం నాయకుడు, మాజీ కౌన్సిలర్ ఎంఏ.ఖాన్(70) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం హైదరాబాద్‌లో మృతిచెందారు. ఎంఏ.ఖాన్ అశోక్‌నగర్ కౌన్సిలర్‌గా పనిచేశారు. సీఐటీయూ, ఆవాజ్ రాష్ట్ర నాయకుడిగా, అంతకుముందు ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేశారు. ఆ తరువాత అమెరికా వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఎంఏ.ఖాన్ అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం మిర్యాలగూడలో ఎంఏ.ఖాన్ అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఎంఏ.ఖాన్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి దంపతులు హైదరాబాద్‌లో సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీపీఎంలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే పలువురు సీపీఎం నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించిన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లుగౌతంరెడ్డి, బావండ్ల పాండు, అయూబ్, రాగిరెడ్డి, మంగారెడ్డి, పరుశురాములు, ఎండీ అంజాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో సైన్స్ పాత్ర ముఖ్యమైంది



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రవి కుమార్

త్రిపురారం : సమాజంలోని మనిషికి సైన్స్ ఎంతో ప్రాముఖ్యమైందని త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధులతో కలిసి స్పిరిట్ ఆఫ్ గివింగ్ సైన్స్ కార్యక్రమంలో భాగంగా ఆరో తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులతో కలసి సైన్స్ ప్రయోగాలను చేయించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులో మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలను పారదోలి సైన్స్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమాజానికి ఉపయోగపడే విధంగా సైన్స్‌ను భాగం చేసుకొని కొత్త కొత్త ప్రయోగాలు చేయాలన్నారు. సైన్స్ నేర్చుకుంటూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైంటిస్టుగా ఏదిగి తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రతినిధులు రవి, సూరజ్, రామకృష్ణ, నీరజ, కావ్య, రితిక బసవరాజు, లతీఫ్ ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, రాములు, సైదులు, మోతీలాల్, రామారావు, పాల్గొన్నారు.

యాదవ మహాసభ మండల కమిటీ ఎన్నిక

పెద్దవూర : అఖిల భారత యాదవ మహాసభ నూతన మండల కమిటీని గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వీరబోయిన వెంకటయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కుంటిగోర్ల రాజశేఖర్ యాదవ్, యూత్ అధ్యక్షుడిగా మన్నెం రాము, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రేపాకుల సాయి కుమార్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏడుకొండలు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి గోర్ధన్ యాదవ్ పాల్గొని ఎన్నికైన సభ్యులకు నియామకపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు నడ్డి లింగయ్య యాదవ్ సుధాకర్, నర్సింహా, వెంకటేశ్వర్లు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి వాటర్ ప్లాంట్ బహూకరణ



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఓ, సంస్థ ప్రతినిధులు

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి(కేజీబీవీ) లెర్నింగ్ కర్వ్, బీపీసీఎల్ సంస్థలు సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు వాటర్ ప్లాంట్‌ను బహూకరించారు. గురువారం పాఠశాల ఎస్ఓ శకుంతల, లెర్నింగ్ కర్వ్ సంస్థ సీనియర్ అసోసియేట్స్ తులసి, ప్రణీతలు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఓ మాట్లాడుతూ విద్యార్థులకు మంచినీటి సదుపాయం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా..



తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించి పలువురి మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ, సులోచనరాణి, ప్రభాకరెడ్డి, విజయలక్ష్మీ, పరశురాంగౌడ్, లక్ష్మీ ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

హాలియా : అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం హాలియా పట్టణ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీష్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ కోఆప్షన్ సభ్యుడు సైదులు, లింగయ్య, పెద్ద సైదులు, ఆంజాద్‌ఖాన్, ఆంజనేయులు, యూత్ అధ్యక్షుడు సైదాచారి, వెంకటేశ్వర్లు, శ్రీను, చిన్న, శంకర్, కోటి పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి రాజ్యమేలుతున్న కాంగ్రెస్

మిర్యాలగూడ అర్బన్ : అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ సర్కార్ రాజ్యమేలుతుందని టీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ షోయబ్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అడిగిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. రైతుల పంటలు ఎండిపోతుంటే నీరు ఇవ్వలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తక్షణమే జగదీశ్‌రెడ్డిపై సస్పెండ్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.